సాక్షి సంగారెడ్డి

సోమవారం । 4 । ఆగస్టు । 2025



ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా?
హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో ఆహార పదార్థాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.
వివరాలు 8లో ▸



నిశ్చితార్థం వేడుకకు వెళ్లి..
భువనగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లావాసులు మృత్యువాత పడ్డారు.
వివరాలు 8లో ▸



అధ్వానంగా రహదారులు
రహదారులన్నీ అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఉలుకు పలుకు లేని విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఇదే విషయమై ఈనెల 5న పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనుండగా, రాష్ట్రం నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలతో 6న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 7న రాష్ట్రపతికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు నియోజకవర్గం నుంచి 20 మంది కార్యకర్తలు తరలివెళ్లనున్నారని వివరించారు.

గెస్ట్ లెక్చరర్లకు ఆహ్వానం

జోగిపేట(అందోల్): జోగిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. సీఎంఈ పోస్టులు 5, ఈసీఈ 4, ఇంగ్లీష్ 1, గణితం 2, ఫిజిక్స్ 2, కెమిస్ట్రీ 2 మొత్తం 16 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ, పీజీ అర్హత కలిగి ఉండాలని, ఇంటర్వ్యూ తేదీని అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. అలాగే ఈనెల 5, 6 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు సంబంధించి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): వర్గల్‌లోని నవోదయ విద్యాలయంలో 2026– 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 13 వరకు పొడిగించినట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. గత నెల 29తో గడువు ముగిసినప్పటికీ విద్యార్థుల సౌకర్యార్థం పొడిగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులను వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏడుపాయలలో భక్తుల సందడి



అమ్మవారి సన్నిధిలో భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల పుణ్యక్షేత్రం ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆ ఉద్యోగుల తొలగింపు సరికాదు: సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు వెంటనే నిలిపివేసి, వారికి రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన మాట్లాడారు. 36 ప్రభుత్వ శాఖల్లో 90 వేల మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరిని రెన్యూవల్ చేయకుండా దాదాపు 4,500 మందిని ప్రభుత్వం పక్కన పెట్టడం దారుణం అన్నారు. వారికి నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

జోగిపేట(అందోల్): జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జోగిపేట ఎస్సీ మహిళా కాలేజీ హాస్టల్‌కు తక్షణమే నూతన భవనం ఏర్పాటు చేయాలని, స్కూల్, కళాశాల హాస్టల్ రెండు ఒకే దగ్గర ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

భూ వివాదాల్లో పోలీసులు!

- అర్ధరాత్రి తాత్కాలిక కట్టడాల కూల్చివేత?
- సివిల్ తగాదాను సెటిల్ చేసిన మరో అధికారి
- విమర్శలకు దారితీస్తున్న కొందరు పోలీస్ అధికారుల తీరు
- కొనసాగుతున్న శాఖాపరమైన విచారణ



బుల్డోజర్‌తో వివాదాస్పద భూముల్లోకి వెళ్లిన ఓ సీఐ

పటాన్‌చెరు పోలీస్ డివిజన్‌లో ఓ సీఐ భూ వివాదంలో పూర్తిగా తలదూర్చాడు. అర్ధరాత్రి తన స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు సిబ్బందిని వెంటబెట్టుకొని కొందరు వ్యక్తులతో కలిసి వెళ్లి ఓఆర్ఆర్ పక్కనే ఓ వివాదాస్పద స్థలంలో ఉన్న తాత్కాలిక రేకుల షెడ్డును రాత్రికి రాత్రి దగ్గరుండి కూల్చివేయించాడనే ఫిర్యాదులు అందాయి. కావలా ఉన్న సెక్యూరిటీ గార్డులను సైతం ప్రైవేట్ వాహనాల్లో అక్కడి నుంచి తీసుకెళ్లి ముత్తంగి వద్ద చిమ్మచీకట్లో వదిలేశారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సీసీటీవీ ఫుటేజీలు, తగిన ఆధారాలతో బాధితులు ఎస్పీతో పాటు, డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే విలేకరుల సమావేశం నిర్వహించి పలు ఆరోపణలు చేశారు. డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణ జరుగుతున్నట్లు తెలిసింది.

సంగారెడ్డి పోలీసు డివిజన్‌లో పనిచేస్తున్న మరో సీఐ ఓ ఇంటి స్థలం విషయంలో ఇద్దరి మధ్య నెలకొన్న భూ వివాదాన్ని సెటిల్ చేశాడు. పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుని ఇల్లు కట్టుకుంటున్న వ్యక్తులను తీవ్ర స్థాయిలో దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగాడు. బాధితులు జిల్లాలోని ఓ కీలక నేతను ఆశ్రయించారు. దీంతో ఇరువర్గాలతో మాట్లాడి పంపించేశారు. దీనిపై కూడా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో కొందరు పోలీస్ అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సివిల్ తగాదాల్లో తలదూర్చుతుండటంతో పోలీసుశాఖ ప్రతిష్ట దెబ్బతింటోంది. ప్రధానంగా భూవివాదాల్లో జోక్యం చేసుకుంటుండటంతో వివాదాస్పదమవుతోంది. పెద్ద మొత్తాల్లో ముడుపులు పుచ్చుకుంటున్న కొందరు అధికారులు ఈ భూవివాదాల్లో పరిధి దాటి వ్యవహరిస్తుండటం గమనార్హం. పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని ఆశాఖ ఉన్నతాధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు. కానీ కొందరు ఈ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. తమ తీరును ఏ మాత్రం మార్చుకోవడం లేదు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి అన్నట్లుగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తమకు జరిగిన అన్యాయంపై సామాన్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే కనీసం పట్టించుకోని కొందరు పోలీసు అధికారులు, ఈ భూవివాదాల్లో మాత్రం తమ పరిధి దాటి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు..

జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్ ఇలా నాలుగు పోలీసు డివిజన్లు ఉన్నాయి. మొత్తం 33 పోలీస్‌స్టేషన్లు ఉండగా, లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు 29 ఉన్నాయి. మిగితావి ట్రాఫిక్, సీసీఎస్, మహిళా స్టేషన్లు ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లలో కొన్ని కీలక పోలీస్‌స్టేషన్లకు ఎస్‌హెచ్‌ఓలుగా సీఐలు వ్యవహరిస్తున్నారు. మిగితా చోట్ల ఎస్ఐలు ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్నారు. పోలీస్ అధికారులు సివిల్ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలుంటాయని ఈ శాఖ ఉన్నతాధికారులు తరచూ హెచ్చరిస్తున్నారు. అయినా కొందరు అధికారులు ఈ ఆదేశాలను పెడచెవిన పెడుతుండటం గమనార్హం.

కఠిన చర్యలు తప్పవు

భూవివాదాలు, సివిల్ తగాదాల్లో తలదూర్చే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నాం. ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా పోలీస్ అధికారులు భూవివాదాల్లో తలదూర్చినట్లు మాకు ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– పరితోష్ పంకజ్, ఎస్పీ

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోదావరి, నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రతి ఇంటికి కరపత్రాన్ని అందజేసి వారి సమస్యలను సేకరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ అవినీతిని సైతం ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దోమల విజయకుమార్, నాయకులు వాసు, గిరిధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, పవన్, గురునాథ్, గోవింద్, బాబా, చారి తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లిలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న హకీం

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీం హెచ్చరించారు. ఆదివారం హత్నూరలో విలేకరులతో మాట్లాడారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తుంటే జీర్ణించుకోవడం లేదన్నారు. అధికారిక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తే ఎమ్మెల్యే సునీతారెడ్డి ఎందుకు అభ్యంతరం చెప్పారని ప్రశ్నించారు. ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ, జిల్లా మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్, కాంగ్రెస్ నాయకులు సత్యం, రియాజ్, పెంటయ్య, మణిదీప్, లక్ష్మీనారాయణ, సాయి, వెంకటేశ్, అబ్దుల్ ఖదీర్, ఆంజనేయులు, నర్సింలు, రాములు, సదాశివులు పాల్గొన్నారు.

బిల్లును అడ్డుకుంటున్నది బీజేపీనే

- కాళేశ్వరంలో ఎవరు తప్పు చేసినా ఉపేక్షించొద్దు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నారాయణఖేడ్: బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ జిల్లా నాల్గవ మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకులు స్వార్థం కోసం అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం విషయంలో తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఆ సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటాలకైనా తమ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. సింగూరు జలాలు సంగారెడ్డి జిల్లా ప్రజలకే అందాలన్నారు. జిల్లాలో తాగు, సాగునీటి కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి కర్మాగారాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి ఈటీ నర్సింహా, కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంద పవన్, నాయకులు ప్రకాశ్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ సభ్యులు రెహమాన్, తాజొద్దీన్, దత్తురెడ్డి, మహబూబ్‌ఖాన్, రుబీనా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ అన్యాయం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నం బీసీలకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చదని, ప్రతిపాదిత బీసీ రిజర్వేషన్లలో 10 శాతం ముస్లిం కోటా ఉన్నందున వారికి 32 శాతం రిజర్వేషన్లు మాత్రమే లభిస్తాయని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. మహా సంపర్క్ అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ కార్యకర్తలు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమలు చేసే చాలా పథకాలు కేంద్రం నిధులతోనే అమలు చేస్తున్నారని తెలిపారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం, దాని అనుబంధం రంగాల కోసం ఏకంగా రూ. 71 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అన్నివర్గాల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేక, జనహిత పాదయాత్ర అని కొత్త డ్రామాకు తెరతీశారని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మే స్థితిలో లేరన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకే పట్టం కడతారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో భక్తుల సందడి



ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సెలవు రోజు కావటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు.

బోనం.. వైభవం



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పద్మారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ శివారులోని కాళికామాత దేవాలయం వద్ద శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాలు ఊరేగింపు ఘనంగా చేపట్టారు. ఉదయం నుంచే వేద పండితులు హోమం, అర్చనలు, అభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డితో పాటు పలువురు వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న వెల్మకన్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ 765డీ జాతీయ రహదారిపై వెల్మకన్న గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వే నంబర్ 447లో ప్రభుత్వ భూమిని కౌడిపల్లికి చెందిన వ్యక్తి అసైన్డ్ ల్యాండ్ పేరిట కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. ఈవిషయమై మండల, డివిజన్, జిల్లా రెవెన్యూ అధికారులతో పాటు హైదరాబాద్ సీసీఎల్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల అండతో కబ్జాకు పాల్పడుతున్నాడని వాపోయారు. రాస్తారోకోతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ రంజిత్‌రెడ్డి గ్రామస్తులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం గ్రామస్తులు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

నిలిచిన నిమ్జ్ భూ సేకరణ

- కార్యకలాపాలకు బ్రేక్
- ఆగిన పరిహారం చెక్కుల పంపిణీ



నిమ్జ్ కోసం సేకరించిన భూమి

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. కొన్ని రోజులుగా స్పీడ్ అందుకున్న భూసేకరణ పనులు ఆగిపోయాయి. నిమ్జ్ కార్యాలయంలో ప్రస్తుతం కార్యకలాపాలు జరగడం లేదు. జూలై 10న నిమ్జ్ కార్యాయలంలో ఏసీబీ దాడులు చేయడంతో భూసేకరణకు సంబంధించి పరిహారం చెక్కుల పంపిణీ నిలిచిపోయింది. జహీరాబాద్ ప్రాంతానికి జాతీయ ఉత్పాదక మండలి (నిమ్జ్) మంజూరు కాగా, నియోజకవర్గం పరిధిలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో 12,635 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను నిమ్జ్‌కు కేటాయించారు. ఫేజ్ వన్‌లో 3,240 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,888 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 352 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇటీవట ఫేజ్‌వన్‌కు సంబంధించి మిగులు భూమి సేకరణకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. నిమ్జ్ కార్యాలయంలో పనులు జరగని కారణంగా పరిహారం చెక్కుల పంపిణీ నిలిచిపోయింది. సెకండ్ ఫేజ్‌లో 9,747 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 4 వేల ఎకరాల భూమిని సేకరించారు. హద్నూర్, మామిడి తదితర గ్రామాలకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. పంపిణీకి చెక్కులు కూడా సిద్ధంగా ఉన్నాయి. పరిహారం చెక్కుల కోసం రైతులు నిమ్జ్ కార్యాలయం చుట్టూ తిరిగి వెళ్తున్నారు. ఏసీబీ దాడుల తర్వాత కార్యాలయంలో ఎలాంటి పనులు కూడా జరగడం లేదు. నెల రోజుల క్రితం నిత్యం రైతులతో కిక్కిరిసిన నిమ్జ్ కార్యాలయం ప్రస్తుతం బోసిపోయింది.

ఆర్డీఓకు అదనపు బాధ్యతలు

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు (రాజిరెడ్డి), డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్య ఏసీబీ అధికారులకు దొరికిపోయిన విషయం తెలిసిందే. జహీరాబాద్ ఆర్డీఓ రాంరెడ్డికి నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలను కలెక్టర్ ప్రావీణ్య అప్పగించారు. నిమ్జ్ భూముల సేకరణకు సంబంధించిన పనులపై ఆర్డీఓ శ్రద్ధ చూపడం లేదు. ఏసీబీ దాడుల నేపథ్యంలో పరిహారం చెల్లింపుల వ్యవహారంలో గందరగోళం నెలకొనడంతో నిమ్జ్ ఫైళ్లను ముట్టుకోవడం లేదని తెలిసింది. దీంతో నిమ్జ్ కార్యాలయంలో కార్యకలాపాలు స్తంభించాయి.

11 సంవత్సరాలుగా..

నిమ్జ్ కోసం 11 సంవత్సరాల నుంచి వందల ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. రక్షణ ఏరోనాటిక్స్ అంతరిక్ష రంగాల్లో ఉపయోగించే పరికరాలను ఉత్పత్తి చేసే వెమ్ టెక్నాలజీతో ఒప్పందం జరిగింది. రూ. వెయ్యి కోట్లతో ఏర్పాటుకానున్న పరిశ్రమలకు 511 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మేరకు గత ప్రభుత్వంలో శంకుస్థాపన కూడా చేశారు. ఆటోమోటీవ్ విడిభాగాల జర్మనీ కంపెనీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ట్రైటాన్, హ్యుందాయ్ మోటార్స్‌తో కూడా ఒప్పందాలు జరిగాయి. హ్యుందాయ్ మోటార్స్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ప్రచారం జరిగింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా కలిశారు. కానీ ఇంత వరకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం లేదు. నిమ్జ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాలేజీలో ఈఈఈ, సివిల్ బ్రాంచ్‌లో మిగులు సీట్లకు విద్యార్థుల మెరిట్ ప్రతిపాదికన సీట్లు 11వ తేదీన కేటాయించనున్నట్లు చెప్పారు. 2025 పాలిసెట్‌కు హాజరు కాని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

‘బాలకథా చంద్రిక’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం రచించిన ‘బాలకథా చంద్రిక’ బాలల కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చందమామ కథా రచయిత మాచిరాజు కామేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రచయితలు పైడిమర్రి రామకృష్ణ, చంద్రప్రతాప్, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, బూర్ల నాగేశ్వరరావు, పుప్పాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉండ్రాళ్లరాజేశం బాలల కోసం గేయాలు, కథలు, పద్యాలు తదితర రచనలతో చేసిన బాలసాహిత్య కృషిని కొనియాడారని పేర్కొన్నారు.

బాలసాహిత్య పురస్కారాలు ప్రదానం




పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థినులు జక్కుల లోహిత, అఖిల

ప్రశాంత్‌నగర్ / చిన్నకోడూరు (సిద్దిపేట): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాలలో 10వ తరగతి చదువుతున్న జక్కుల లోహితకు ప్రథమ బహుమతి లభించిందని పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వరుకోలు లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మాచిరాజు బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాలల కథల పోటీల్లో 541 కథల్లో లోహిత రాసిన ‘‘ధూమపానం’’ కథ ప్రథమ బహుమతి పొందిందని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్ చేతుల మీదుగా లోహిత బహుమతి, మాచిరాజు బాల సాహిత్య పురస్కారం అందుకున్నారని చెప్పారు. కాగా, చిన్న కోడూరు మండలంలోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని అఖిల కూడా మాచిరాజు బాల సాహిత్య పురస్కారం అందుకున్నదని ఉపాధ్యాయుడు దుర్గయ్య తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు



బంగారు పతకం సాధించిన గణేశ్

సిద్దిపేట జోన్: హన్మకొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేటకు పతకాలు లభించాయి. అండర్ 20 విభాగంలో రేస్ వాక్‌లో గణేశ్ బంగారు పతకం సాధించగా, అండర్ - 16 బాలికల విభాగంలో సిరి చందన జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా వారిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు.

ఆలయంలో ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న యోగా సాధకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీ గండబేరుండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో నిత్య జీవన యోగాసాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువులు బాసంపల్లి సురేందర్ గౌడ్, సంతోష్ ఆధ్వర్యంలో నిత్యం యోగా సాధన చేసే వారంతా కలిసి ముందుగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం యోగా సాధన చేసి రోజంతా కబుర్లు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, హనుమంత్ గుప్తా, భిక్షపతి రెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

వికసించిన కదంబ వనవాసిని పుష్పాలు




కదంబ వానవాసిని పుష్పాలు



రోడ్డు పక్కన ఉన్న కదంబ వనవాసిని చెట్టు

గుండ్రంగా బంతిలా వికసిస్తూ కనిపిస్తున్న కదంబ వనవాసిని పుష్పాలను తిలకించిన ప్రతి ఒక్కరూ అబ్బుర పడుతున్నారు. సుతిమెత్తగా, సుకుమారంగా వికసించే ఈ పుష్పాలు కంటికి ఇంపుగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత వాసులకు అంతగా పరిచయం లేని ఈ చెట్లు ఎక్కువగా వారణాసిలోని కాశీ, మధురై, త్రిపురాంతకంలో ఎక్కువగా కనిపిస్తాయి. గత హరితహారంలో రోడ్లకిరువైపులా నాటిన కదంబ మొక్కలు ప్రస్తుతం ఏపుగా ఎదిగి పుష్పిస్తున్నాయి. ఏడాదిలో ఆషాఢమాసంలో పుష్పించడం వల్ల పార్వతీదేవి అమ్మవారికి ఈ పుష్పాలు ప్రీతిపాత్రమైనవిగా చెప్పుకుంటారు. అమ్మవారికి ఒక్క పుష్పంతో పూజిస్తే 108 పువ్వులతో పూజించినట్టేనని నమ్ముతారు.

– మిరుదొడ్డి(దుబ్బాక):

విశ్వశాంతి కోసం వీరశైవుల పాదయాత్ర



ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం వరకు చేపట్టిన 18వ మహా పాదయాత్రను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషమన్నారు. నియోజకవర్గంలోని వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, సమాజం ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా?

హోటల్స్, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ తనిఖీలేవీ?

- నిల్వ చేసిన పదార్థాలతో వంటకాలు
- అపరిశుభ్రంగా వంటగదులు
- నిమ్మకు నీరెత్తినట్లు అధికారుల తీరు

ప్రజలు తినే ఆహార పదార్థాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లలో ప్రజారోగ్యం దృష్ట్యా ఫుడ్ సేఫ్టీ, మున్సిపాలిటీ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. నిల్వ చేసిన మాంసం, కుళ్లిన వాటితో వంటకాలు చేసి విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కానీ, జిల్లాలో అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– దుబ్బాకటౌన్



దుబ్బాకలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఆహార తనిఖీ అధికారి జయరామ్(ఫైల్)

దుబ్బాక నియోజకవర్గంలో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో 30కి పైగా రెస్టారెంట్‌లు, దాబాలున్నాయి. కానీ సంవత్సరం నుంచి అధికారుల తనిఖీలు కరువయ్యాయి. ఓ వైపు హోటల్స్, దాబాల్లో నాసిరకం ఆహార పదార్థాలు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

సాంబార్‌లో పురుగు..

ఇటీవల దుబ్బాక పట్టణంలో శ్రీకృష్ణ ఉడిపి హోటల్‌లో సాంబర్‌లో పురుగు వచ్చిన ఘటన కలకలం రేపింది. దీంతో అధికారులు తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. ఫలితాలు ఇంకా బయట పెట్టలేదు. అపరిశుభ్రంగా ఉందని, కుళ్లిన కూరగాయలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు రూ.5వేల జరిమాన విధించారు.

తనిఖీలు కరువు..

సంవత్సరం నుంచి దుబ్బాకలో అధికారుల తనిఖీలు లేవు. దీంతో కొందరు హోటల్ నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను వండి విక్రయిస్తూ.. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గతంలో సైతం దుబ్బాకలో కుళ్లిన కేక్ విక్రయించిన ఘటన చోటు చేసుకుంది. అనంతరం కనీసం తనిఖీలు నిర్వహించకపోవడంతో అసలు ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఉన్నారా? లేరా? అనే అనుమానాలు పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ బేకరీలో కాలం చెల్లిన బిస్కెట్ విక్రయించినట్లు తెలిసింది. కూరగాయలు, మాంసం కుళ్లిపోయిన వాటిని ఫ్రిజ్‌లో భద్రపరిచి వండి విక్రయిస్తున్నారని వినికిడి. రెస్టారెంట్లు, చిన్నచిన్న హోటళ్లు, రోడ్డు పక్కన విక్రయించే తినుబండారాల్లో కల్తీ నూనెలు, మసాలా దినుసులు వాడటం వల్ల అనేక ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు..

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనేది అర్థం కాని ప్రశ్న. జిల్లాలో కొన్ని చోట్ల తనిఖీలు నిర్వహించిన అధికారులు కేవలం శాంపిళ్లు తీసుకెళ్లి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా స్థానిక మున్సిపాలిటీ అధికారులు, ఇటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నుంచి తనిఖీలు లేకపోవడంతో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న హోటల్స్, రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

“ అధికారులు చర్యలు తీసుకోవాలి



నా పేరు యాదగిరి. మాది దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామం. నేను ఉడిపి హోటల్‌లో దోశ ఆర్డర్ చేసి తింటున్నప్పుడు సాంబార్‌లో పురుగు కనిపించింది. వెంటనే యజమానిని అడగగా పొంతన లేని సమాధానం చెప్పాడు. ఒకవేళ నేను ఆ పురుగును చూడకపోతే నా పరిస్థితి ఏమయ్యేది. నిర్లక్ష్యం వహిస్తున్న హోటళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యాదగిరి, రాజక్కపేట ”

కూల్ డ్రింక్స్ పై రూ.10 అదనం

దుబ్బాకలో కొన్ని రెస్టారెంట్‌లలో రూ.10 కూల్‌డ్రింక్‌కు ఏకంగా మరో రూ.10 అదనంగా తీసుకుని హోటల్స్‌కి వచ్చే వారిని దండుకుంటున్నారు. ఎందుకు అదనంగా తీసుకుంటున్నారని అడిగితే రూ. 10 కూల్‌డ్రింక్ పై ఏసీ ఛార్జ్ వేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. కాగా, దుబ్బాకలో ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని జిల్లా ఆహార తనిఖీ అధికారి జయరామ్‌ను సాక్షి వివరణ కోరగా పొంతన లేని సమాధానం చెప్పాడు.

సమస్యల పరిష్కారానికి కృషి



నరసింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్‌లో కార్మిక సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ...త్వరలోనే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీలను నియమిస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహారెడ్డిని కార్మిక సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ ఐఎన్‌టీయూసీ అమర్ సింహారెడ్డి, ఆంటోనీ, శ్రీధర్, కరుణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేశ్, కిష్టయ్య, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

గంగారంలో పర్యటించిన సీపీఎం నాయకులు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): పట్టాలిచ్చిన అందరికీ వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని గంగారంలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంగారంలో సర్వే నం.1, 5, 243లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలిచ్చారన్నారు. కానీ ఇళ్లు కట్టుకునేందుకు పర్మిషన్ అడిగితే ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, గ్రామ నాయకులు అనిల్, సాలోమోన్, కృష్ణ, యువాన్, అర్జున్, గంగమ్మ, ఆంజనేయులు, ఏసమ్మ, సురేశ్, బాలమణి, ప్రశాంత్, సంజీవ్ పాల్గొన్నారు.

మెడికల్ షాప్‌కు వెళ్తుండగా..

ఢీకొట్టిన ద్విచక్రవాహనం.. వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వంగపాటి సింగయ్య(75) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం రాత్రి సమయంలో మాత్రలు తెచ్చుకోవడానికి మెడికల్ షాప్‌కు వెళ్తుండగా మెదక్ నుంచి పాపన్నపేట వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య కొండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌ఐ కీర్తిరాజు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ కీర్తిరాజు

దుబ్బాక: పట్టణంలో రెండు దుకాణాల్లో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డ నిందితుడిని 24 గంటల్లోనే పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ కీర్తిరాజు కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మొబైల్ షాపు, పెయింటింగ్ షాపుల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనను పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. చోరీ ఘటనపై ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచనల మేరకు ఆ ప్రాంతంలోని నిఘా నేత్రాలను పరిశీలించగా పట్టణానికి చెందిన చెక్కపల్లి శివగా గుర్తించారు. ఆదివారం ఉదయం బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడు శివను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి వద్ద చోరీ చేసిన 10 సెల్‌ఫోన్లు,1500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. కాగా చోరీ ఘటనను 24 గంటల్లోనే ఛేదించిన దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు, పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆరు తులాల బంగారం చోరీ



హుస్నాబాద్‌రూరల్: ఓ ఇంట్లో బంగారం చోరీ జరిగింది. ఈ ఘటన మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం... జిల్లెలగడ్డకు చెందిన భూక్య మహేందర్ ఇంటికి తాళం వేసి హన్మకొండకు వెళ్లాడు. తెల్లవారు జామున మహేందర్ తల్లి నిద్ర లేచి చూసేసరికి ఇంటి తాళం తీసి ఉండటంతో కొడుకుకు సమాచారం ఇచ్చింది. ఆదివారం అతడు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో దాచిన ఆరు తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదైంది. ఈ ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం... త్రిపురకు చెందిన మంగళ్ దెబ్బర్మ రుద్రారం గ్రామ సమీపంలో ఆదివారం గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేశారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో బండారి మణిదీప్ అనే వ్యక్తి వద్ద 450 గ్రాముల గంజాయిని, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ పేరుతో సైబర్ వల

1.94లక్షలు పోగొట్టుకున్న యువకుడు

రామాయంపేట(మెదక్): సైబర్ నేరగాళ్లకు చిక్కి ఓ యువకుడు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ బాల్‌రాజ్ వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వేముల సుజిత్ తన ఫోన్‌లో వర్క్ ఫ్రం హోం జాబ్ అని వచ్చిన మెసేజ్ చూసి సదరు నంబర్‌కు ఫోన్ చేశాడు. కొంత నగదు ఇన్వెస్టు చేస్తే అధికంగా డబ్బులు వస్తాయని గుర్తు తెలియని అగంతకులు చెప్పగా నమ్మాడు. సుజిత్ విడతల వారీగా రూ.1.94 లక్షలు వారికి పంపించాడు. తరువాత వారి వద్ద నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం వెలుగు చూసింది. చేగుంట అదనపు ఎస్‌ఐ బిక్యానాయక్ వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మహావీర్ గ్రామానికి చెందిన శివబహద్దూర్ తన ఇద్దరు కొడుకులతో కలిసి చేగుంటలో ఉంటూ ముగ్గురు ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దకుమారుడు అశిశ్‌కుమార్(24) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న మందులకోసం వెళుతున్నట్లు బయటకు వెళ్లిన అశిశ్‌కుమార్ ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదు. ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలో అశిశ్‌కుమార్ ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహకారంతో మృతుడిని గుర్తించి తండ్రికి సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెప్పిన పని చేయలేదని..

- కుమారుడి తలపై బండరాయితో కొట్టిన తల్లి
- తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు

వట్‌పల్లి(అందోల్): కుమారుడిని బండరాయితో కొట్టి ఓ తల్లి గాయపరిచింది. ఈ ఘటన మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దాసు అనురాధ దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కూతుళ్లు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. కుమారుడు రాజు (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తల్లి అనురాధ తన కుమారుడిని సంచులు ఇంట్లో వేయాలని చెప్పగా రాజు నిరాకరించాడు. చెప్పిన పని వినలేదని ఆగ్రహించిన తల్లి బండరాయితో కుమారుడి తలపై కొట్టగా తలకు తీవ్ర గాయాలవడంతో రక్త స్రావమైంది. దీంతో కుమారుడు వెంటనే తండ్రి దాసుతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. తన తల్లి జల్సాలకు అలవాటుపడి తమను వేధిస్తోందని, తల్లితో తనకు ప్రాణహాని ఉందని చర్యలు తీసుకోవాలని బాలుడు పేర్కొన్నాడు.

నిశ్చితార్థం వేడుకకు వెళ్లి.. అనంతలోకాలకు..

- ద్విచక్రవాహనదారులు, పాదచారులపైకి దూసుకువచ్చిన లారీ
- ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు



రామకృష్ణ



సాయికుమార్



లారీ - గోడ మధ్యన ఇరుక్కుపోయిన రామకృష్ణ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో లారీ బీభత్సం సృష్టించింది. లారీ ఢీకొని ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ(35), చిలమామిడి సాయికుమార్(22) హైదరాబాద్‌లోని సూరారం కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా, సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నిశ్చితార్థం వేడుకకు బంధువులతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో స్వీట్స్ కోసం రామకృష్ణ, సాయికుమార్ ఇద్దరూ కారులో పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాకు బయలుదేరారు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపు దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో రాజస్థాన్‌కు చెందిన లారీ ఉత్తరప్రదేశ్ నుంచి జగదేవ్‌పూర్ మీదుగా చెన్నైకి వెళ్తూ వేగంగా దూసుకువచ్చి అక్కడే ఉన్న పాదచారులు, ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, సాయికుమార్‌తో పాటు రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బీమారి శివసాయికుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయికుమార్‌తో పాటు శివసాయికుమార్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సాయికుమార్ మృతి చెందాడు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రామకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు, సాయికుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

ధ్వంసమైన షాపులు, బైకులు

లారీ వేగంగా దూసుకురావడంతో రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్, పాన్‌షాప్‌లు, అక్కడే ఉన్న మూడు బైకులు ధ్వంసమయ్యాయి. మృతుడు రామకృష్ణ లారీ, గోడ మధ్యన ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.